క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



నరసరావుపేట ఈస్ట్: కంటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో శనివారం టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ సహకారంతో శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి శంకర వైద్యశాలలో ఉచితంగా చేస్తామని వైద్యులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం ఎ.భువనేశ్వరి మాట్లాడుతూ కంటి ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు పలు సూచనలు చేశారు. శిబిరంలో డాక్టర్ శ్యాందీప్, డి.గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బి.ఎస్.ఆర్.కె.రాజు, హౌసింగ్ ఫైనాన్స్ ప్రతినిధులు సతీష్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక పూజలు

నూజెండ్ల: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవ, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో పాల్గుణ మాసం శనివారం సందర్భంగా కేజీబీజీ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో మంచి ఫలితాలు సాధించేలా హాల్ టికెట్లను స్వామి వారి పాదుకుల వద్ద ఉంచి హనుమాన్ చాలీసా పారాయణం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తోమాల సేవ తదితర పూజలు ఆలయ పూజారి కోసూరి రామమోహనాచార్యులు నిర్వహించారు.

రేపు గ్రీవెన్స్ డే

నూజెండ్ల: గ్రీవెన్స్ డే ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఆర్.రమేష్ కుమార్ శనివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు మళ్లీ ప్రారంభించనున్నట్లు తహసీల్దారు వెల్లడించారు.

ఎంఈఓ కార్యాలయానికి ఫ్యాన్లు వితరణ



శావల్యాపురం: ఎంఈఓ కార్యాలయానికి ఎస్టీయూ శావల్యాపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను శనివారం అందజేశారు. ఎంఈఓ మద్దికుంట సాంబశివరావుకు ఎస్టీయూ సంఘం అధ్యక్షులు బిళ్ళా రాజారమేష్ అందించారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం శక్తి వంచన లేకుండా ఎస్టీయూ శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు కొండ్రముట్ల వెంకటరత్నం, సీఆర్‌పీ రావూరి శివప్రసాద్, మస్తాన్‌రావు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ల 111 కేసులు పరిష్కారం



చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 111 కేసులు పరిష్కరించారు. రూ.11,01,75,564 పరిహారంగా చెల్లించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.నరేందర్ రెడ్డి పాల్గొని అదాలత్‌లో 53 క్రిమినల్ కేసులు, 11 చెక్కు బౌన్స్ కేసులు, 5 భరణం కేసులు, 5 డీవీసీ, 10 సివిల్, 14 ఎక్సైజ్, 12 ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నాదెండ్ల: గణపవరం జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి వద్ద రూ.15 లక్షలతో నిర్మించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖద్వారంతో పాటూ దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు కెల్లంపల్లి అచ్చయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వ్యాపారవేత్త పేర్ని వీరనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు కంచర్ల శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, కాట్రు కృష్ణారావు, శివరామకృష్ణ, నన్నపనేని శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎన్.లావణ్య

నరసరావుపేటటౌన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.లావణ్య మాట్లాడుతూ మహిళల హక్కులు, ప్రభుత్వం వారి సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు, న్యాయ సహాయం పొందే విధివిధానాలు, మహిళల హక్కులను పరిరక్షించుకునే విధానాలను వివరించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే ఎటువంటి సందేహం లేకుండా స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించ వలసిందిగా ఆమె కోరారు. రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో...

నరసరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షులు కోసూరి గాయత్రి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కాకుమానుబజార్‌లోని దేవీశ్రీ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కార్యవర్గసభ్యులు యడ్లపాటి స్వరూపరాణి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం అమలుచేస్తున్న కేంద్ర పథకాలను గురించి వివరించారు. అవయవదానం గురించి అవగాహన కల్పించారు. గౌరవ అతిథిగా హాజరైన బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ వల్లేపు కృపారావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పుట్టి లక్ష్మీ సామ్రాజ్యం, బీజేపీ పట్టణ మహిళా అధ్యక్షులు వూర సుజాత, నిర్మా సుజాత, సీతాదేవీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో...

నరసరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఆర్టీసీ డిపో ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి జీఎస్‌వీవీ కుమార్ అధ్యక్షతన ఉత్తమ ప్రతిభా మహిళలను శాలువాలతో సన్మానించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవాణా శాఖ ఏఎంవీఐ సీహెచ్ మనీషా వారిని సన్మానించారు. డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు, డీపీటీఓ కార్యాలయ సిబ్బంది ఏఎంపీ ప్రసాద్, వివిధ యూనియన్ల నాయకులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూతన బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ స్థానిక డిపో నుంచి గుంటూరుకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన నూతన నాన్ స్టాఫ్ బస్సును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రిబ్బన్‌కట్‌చేసి, పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులోకి ఎక్కి పరిశీలించారు. బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. ఆర్టీసీ డీఎం కుమార్ పాల్గొన్నారు.



ఏఎంవీఐ మనీషాను సన్మానిస్తున్న ఆర్టీసీ మహిళా ఉద్యోగులు



మహిళకు బహుమతి అందిస్తున్న అసిస్ట్ అధినేత డాక్టర్ జాస్తి రంగారావు



ఎస్ఈసీలో మిట్టపల్లి లక్ష్మిని సత్కరిస్తున్న కళాశాల డీన్ పొన్నారి లక్ష్మీ తదితరులు

ఘనంగా మహిళా దినోత్సవం

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం మండలంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా అధికారులు, సిబ్బందిని ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్యఅతిథులుగా కంటి వైద్యులు డాక్టర్ భాస్కరలక్ష్మి, డాక్టర్ సృజన, జిల్లా జాయింట్ కలెక్టర్ సతీమణి డాక్టర్ అదితి, కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, మిట్టపల్లి లక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థినులుకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య పాల్గొన్నారు. మహిళా అధ్యాపకులతో కేక్‌ను కట్ చేశారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సురేష్‌నాయక్



ఎంఏఎం కళాశాలలో కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ దరువూరి శ్రావ్య

బొప్పూడిలో..

చిలకలూరిపేటటౌన్: బొప్పూడిలోని ఎస్‌పీఎస్‌అండ్‌జీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయిని గజేంద్రమ్మ మాట్లాడుతూ స్త్రీల సమస్యల గురించి చర్చించి పరిష్కరించుకోవడానికి చట్టసభల్లో స్త్రీలకు అధిక ప్రాధాన్యత ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయునులు గజేంద్రమ్మ, హనుయామ్మ, అనిత, పద్మాంజలి, నాగమణిలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బి వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన తపాలా ఉద్యోగులకు సత్కారం

నరసరావుపేటటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తపాల శాఖ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన మహిళ ఉద్యోగులకు శనివారం కార్యాలయంలో సత్కరించారు. పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి మాట్లాడుతూ పీఓఎస్‌బీ, ఎస్ఎస్‌బీ, పీఎల్ఐ, ఐపీపీబీ క్యాటగిరిలలో ప్రతిభ చూపిన మహిళ ఉద్యోగులకు సన్మానించి ప్రశంసా పత్రం అందజేసినట్లు తెలిపారు. క్యాటగిరిలలో రాణించిన ఉద్యోగులను ఆదర్శంగా తీసుకొని మిగిలిన ఉద్యోగులు కూడా రాణించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మీరాజ్ ఫాతిమా, ఇన్‌స్పెక్టర్‌లు యాదగిరి, సురేష్, కోటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

అసిస్ట్ ఆధ్వర్యంలో..

చిలకలూరిపేటటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలోని అసిస్ట్ సంస్థలో ఘనంగా నిర్వహించారు. అసిస్ట్ సేవాసంస్థ, ఐటీసీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ మహిళలు ప్రస్తుత పరిస్థితులలో అవలంబించాల్సిన విధానం, ముందుకు వెళ్ళవలసిన పద్ధతులు,అందరితో కలిసి మెలిసి వుండవలసిన అవసరంను గురించి పాల్గొన్న వక్తలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అధినేత డాక్టర్ జాస్తి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు జె.కృష్ణ హరీష్, ఎం.విష్ణుప్రియ, ఐసీడీఎస్ యడ్లపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వినుకొండ: పట్టణంలోని గీతాంజలి స్కూల్‌లో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో మహిళల యొక్క పాత్ర మహోన్నతమైనదని చెప్పారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ వై.శేషగిరిరావు పాల్గొన్నారు.

వృద్ధ మహిళలకు చేయూత..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని ఓ వృద్ధ ఆశ్రమాన్ని తహసీల్దార్ సురేష్‌నాయక్ సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధ మహిళలకు నూతన వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు.



ఎంపీడీఓ కృష్ణకుమారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు, పాల్గొన్న మహిళలు



గీతాంజలిలో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



ప్రశంసా పత్రం అందుకున్న ఉద్యోగులతో పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి



బొప్పూడిలో ఉపాధ్యాయిలకు సన్మానం

గీతాంజలిలో పది విద్యార్థుల వీడ్కోలు సభ

వినుకొండ: పట్టణంలోని గీతాంజలి స్కూల్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థుల తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల ప్రతినిధి శ్రీమన్నారాయణ, గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ వై.శేషగిరిరావు, ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.లక్ష్మణకిషోర్ పాల్గొన్నారు.



తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీవీ

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానికులు నుంచి సేకరించిన వివరాలు.. గ్రామంలోని కొత్తూరు బొడ్రాయి సెంటర్ నివాసితులైన ముస్లిం కుటుంబాలకు చెందిన మహిళలు రోజుమాదిరిగానే మిరప తోటల్లో వ్యవసాయ కూలీ పనులు చేసుకునే నిమిత్తం శనివారం ఉదయం 6 గంటలకు ఆటోలో బయలు దేరారు. నాదెండ్ల మండలం తూబాడు గ్రామానికి వెళ్లేందుకు 16నంబర్ జాతీయ రహదారిపైకి రాగానే అండర్‌పాస్ హైవే వంతెన మీదుగా వేగంగా దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం ఆటో వెనుక భాగంలో ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొడుతూ దూరంగా ఉన్న సర్వీసు డివైడర్ పక్కన ఏర్పాటు చేసిన ఐరన్ సేఫ్టీరాడ్లకు గుద్దుకుని ఆగిపోయింది. అయితే ఢీకొట్టిన వాహనం మాత్రం నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న 14 మంది కూలీలతో పాటు ఆటో డ్రైవరకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు బాధితుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకున్నారు. నుజ్జునుజ్జయిన ఆటో, చిందరవందరగా గాయాలతో పడిఉన్న కూలీలు భయాందోళనకు గురై కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు బాధితులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన ఆరుగురిని జిల్లాకేంద్రం నరసరావుపేట కార్పొరేట్ ఆస్పత్రులకు, మరొకరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వీరిలో జీజీహెచ్‌కు తరలించిన షేక్ రహంతుల్లాబి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు జాతీయ స్థాయిలో ఎల్లో రేటింగ్

రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేషనల్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా జాతీయ స్థాయిలో స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించిందని ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా తమ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ నియమాల కనుగుణంగా అమలు చేస్తున్నామని అన్నారు. జాతీయ స్థాయిలో తమ స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటం లో కో-ఆర్డినేటర్ గా ఉపాధ్యాయులు వై.మల్లికార్జునరావు వ్యవహరించారని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఎల్లో రేటింగ్ సాధించటంపై ప్రధానోపాధ్యాయులు బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జునరావును ఎంఈఓలు హవేల, డి.బ్రహ్మేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ జంగుల పెద్ద శేషయ్య అభినందించారు.



ఎల్లో సర్టిఫికెట్లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

దివిస్ ల్యాబ్‌లో 20 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో దివిస్ ల్యాబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విదార్థులు 80 మంది ప్రాంగణ ఎంపికలో పాల్గొన్నారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలు, రాతపరీక్షలు నిర్వహించి 20 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. దివిస్ సంస్థ ప్రతినిధులు జె.శివకృష్ణ, రామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ పరిశ్రమలు నుంచి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ డి.అశోక్ రెడ్డి, ముగ్గు మురళీకృష్ణ పాల్గొన్నారు.



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు



చిలకలూరిపేట: పాలిథిన్ కవర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పాలిథిన్ కవర్ల వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి పట్టణంలో పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. వీటికి బదులుగా ప్రజలు గుడ్డ సంచులు, జనపనార సంచులు ఉపయోగించాలని సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధించబడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్‌వీ రమణరావు, సీహెచ్ సునీత పాల్గొన్నారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో శనివారం లారీలో ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. మినీ లారీలో ఈ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో దాడి చేసి పట్టుకున్నామన్నారు. లారీ, బియ్యంతో పాటు లారీ నడుపుతున్న వి.పి.కాశిరెడ్డిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అమీన్‌సాహెబ్‌పాలెంలో కంటి వైద్య శిబిరం



నాదెండ్ల: అమీన్‌సాహెబ్ పాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం కాకాని శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బండ్లమూడి సీతారామయ్య, అఖిలాండమ్మ జ్ఞాపకార్థం వారి మనువడు పాటిబండ్ల శేఖర్‌బాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచి కామినేని లలితానాగేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ శ్వేత, డాక్టర్ సాయి సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వీరిలో 30 మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనివారం 20 మందిని ఆస్పత్రి వాహనాల్లో ఆపరేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుర్రం ఉపేంద్ర, ప్రస్తుత ఉపసర్పంచి తేళ్ల రాజేష్, నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరావు, రామారావు పాల్గొన్నారు.

రక్తదానంలో స్వచ్ఛందంగా పాల్గొనాలి

నరసరావుపేట రూరల్: ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సతీమణి డాక్టర్ అదితి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ అదితి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రక్తం సకాలంలో అందకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రక్తదాన శిబిరాల ద్వారా అరుదైన బ్లడ్ గ్రూపులు కలిగిన వారి వివరాలు సేకరించి అత్యవసర సమయాల్లో సంప్రదించడం జరుగుతుందని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో సేకరించిన రక్తానికి అన్ని పరీక్షలు నిర్వహించి తలసేమియా, ఎనీమిక్, సికల్సెక్సెస్ వంటి వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ శరత్‌బాబు, మేనేజింగ్ కమిటి సభ్యులు డాక్టర్ సృజనా, డాక్టర్ రెహమతుల్లా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అదితి

మహిళా సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: మహిళల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి రోడ్డు కోటసెంటర్లో రోడ్ సేఫ్టీ ఎన్జీవో ప్రెసిడెంట్ ఆర్ కనకదుర్గ పద్మజ ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళా పారిశుద్య కార్మికులకు రిఫ్లెక్టర్ జాకెట్లు (సేఫ్టీ జాకెట్లు) అందజేశారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ ఎన్జీవో ద్వారా నిర్వహించిన కార్యక్రమం చాలా మంచిదని, అదే విధంగా 2014 నుంచి ఒక మహిళ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు పని చేయడం చాలా గొప్ప విషయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రంగిశెట్టి రామకృష్ణ, ఎన్జీవో సభ్యులు బంగారయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



దుర్గాపద్మజను సన్మానిస్తున్న దృశ్యం

ఇస్సప్పాలెంలో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెంలో ఎస్‌బీఐ శాఖ శనివారం ప్రారంభమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఎస్‌బీఐ 70 శాఖలు, 501 మహిళా సీఎస్‌పీ పాయింట్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ముఖ్యఅతిథులుగా వర్చువల్‌గా హాజరై నూతన శాఖలను ప్రారంభించారు. గుంటూరు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ డెప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణప్రభు, ఆర్‌బీఓ నరసరావుపేట రీజినల్ మేనేజర్ డి.రామ్‌కుమార్ పాల్గొని బ్రాంచ్ ప్రాంగణంలో ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులను సత్కరించారు. కార్యక్రమంలో ఇస్సప్పాలెం నూతన బ్రాంచ్ మేనేజర్ కె.ప్రతాప్, ప్రాంతీయ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీజీఎం కృష్ణప్రభు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com